క్లుప్తంగా

నూతన సంఘం ఏర్పాటు



అధికారులకు ధ్రువపత్రం అందజేస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్ : ది ఆంధ్రా యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ, అండ్ బీసీ–సీ టీచర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు అయినట్లు సంఘం అధ్యక్షుడు టి.షారోన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం ఏర్పాటు చేసిన ప్రతులను శనివారం ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లకు అందజేశారు. సంఘం అధ్యక్షునిగా ఆచార్య టి.షారోన్‌రాజు, ఉపాధ్యక్షునిగా డాక్టర్ పి.వెంకటరావు, కార్యదర్శిగా డాక్టర్ బి.కిషోర్‌బాబు, కోశాధికారిగా డాక్టర్ వి.సిద్ధయ్య, సభ్యులుగా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.రమేష్, డాక్టర్ డి.నాగరాజకుమార్, డాక్టర్ బి.ప్రజ్ఞ, డాక్టర్ జి.రమేష్‌బాబును ఎన్నుకున్నామన్నారు.

ఘనంగా సాంఘికశాస్త్ర దినోత్సవం



తోటగరువు హైస్కూల్లో తయారు చేసిన ప్రాజెక్టులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాంఘిక శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన మ్యాప్‌లు, గ్లోబులు, చార్టులను ప్రదర్శించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య పోరాట యోధుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. వారు ఆలపించిన దేశభక్తి గీతాలు హృద్యంగా సాగాయి. ఉపాధ్యాయులు సాంఘిక శాస్త్ర ఆవశ్యకతను వివరించారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ఎంవీపీకాలనీ : బీజేపీ యువజన విభాగం నాయకుల అక్రమ అరెస్టులు సరి కాదని ఆ పార్టీ యువమోర్చా బీజేవైఎం ఏపీ అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ అన్నారు. అనంతపురంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ యువజన విభాగం నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలాది దేవాలయాలను ధ్వంసం చేసిన టిప్పుసుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనీయబోమన్నారు.

సాహితీ సముద్ధరణకు విశాలాంధ్ర విశేష కృషి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చలసాని రాఘవేంద్రరావు తదితరులు

మహారాణిపేట : విశాలాంధ్ర సంస్థ 50వ దశకం నుంచి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి తీసుకురావడంలో విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ బుక్ ఫెస్టివల్ పేరుతో నగరంలో ప్రదర్శన నిర్వహించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాలేదని, ఆ లోటును భర్తీ చేయడంలో విశాలాంధ్ర ప్రదర్శన ముందు వరుసలో నిల్చుందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి. మనోహర్‌నాయుడు, రచయిత ఆచార్య సూర్యారావు, బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుంచి పేదల బతుకుల్లో వెలుగులు విరబూసాయి. అభివృద్ధి, సంక్షేమంతో పేదలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. అందులో భాగంగా మౌలిక వసతులు కల్పిస్తూ నివాస ప్రాంతాల్లో ఉండే కాలువలు, గెడ్డలను ఆధునికీకరించింది. ఇందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో అలుముకున్న దుర్గంధం, మురుగునీరు, చెత్త సమస్యకు చెక్ పడింది. తమ ప్రాంతాలు పరిశుభ్రంగా మారడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు గతంలో సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరిగేది. పేదలు తమ బాధల గురించి నాయకులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన రీతిలో పరిష్కారం అయ్యేవి కాదు. దీంతో ప్రజలు బాధలతోనే బతుకులు వెళ్లదీసే వారు. చాలా ప్రాంతాల వాసులు మురుగు, చెత్త సమస్యతో బాధలు పడేవారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యంగా చెత్త సమస్య దూరమయింది. నివాస ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీలు నిర్మించడం వల్ల దుర్గంధం మధ్య జీవించాల్సిన బాధ తప్పిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న వచ్చాకే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ముక్తకంఠంతో **కొనియాడుతున్నారు.**



జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఆధునికీకరించిన గెడ్డ

11, 12, 13 వార్డుల్లో
- రూ.15.28 కోట్లతో గెడ్డల ఆధునీకీకరణ
- రూ.7.50 కోట్లతో కాలువల నిర్మాణం
- రూ. 9.19 లక్షలతో రక్షణ గోడ నిర్మాణం

కను‘మురుగు’

కాలువలు, గెడ్డల నిర్మాణంతో మురుగు సమస్యకు చెక్
సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు



13వ వార్డు ఆరిలోవ కాలనీలో నిర్మించిన కాలువలు



ముడసర్లోవ రిజర్వాయరు చుట్టూ నిర్మించిన రక్షణ గోడ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. విమర్శలకు తావు లేకుండా జరుగుతున్న అభివృద్ధితో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 2019 నుంచి ఇంత వరకు జీవీఎంసీ అధికారులు ప్రజల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణంతో పాటు కాలువలు, గెడ్డల నిర్మాణలు, అవసరమైన చోట్ల రక్షణ గోడలు నిర్మించారు. అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్–2, 3 పరిధిలో 15 వార్డులు ఉన్నాయి. జోన్–2 పరిధిలో 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు ఉండగా, జోన్–3 పరిధిలో 15వ వార్డు నుంచి 23వ వార్డు, 28వ వార్డు ఉన్నాయి.



11వ వార్డు శ్రీహరినగర్ నుంచి తోటగరువు వరకు ఆధునికీకరించిన గెడ్డ

రూ.15.28 కోట్లతో గెడ్డల ఆధునికీకరణ..

జీవీఎంసీ 11, 12, 13 వార్డుల్లో రూ. 15.28 కోట్లతో గెడ్డల ఆధునికీకరణ జరిగింది. జీవీఎంసీ పదకొండో వార్డులో కంబాలకొండ వెనుక భాగాన్ని ఆనుకుని శ్రీహరినగర్, డ్రైవర్స్ కాలనీ నుంచి బాలాజీనగర్, గాంధీనగర్ మీదుగా తోటగరువు కూడలి వరకు సుమారు అరకిలోమీటరు పొడవున ప్రధాన గెడ్డను ఆధునికీకరించారు. దీని కోసం రూ. 5.50 కోట్లు ఖర్చు చేశారు. దీని అడుగు భాగంలో సిమెంట్ కాంక్రీట్ వేసి, ఇరువక్కలా రక్షణ గోడలు నిర్మించారు. పదమూడో వార్డు రామకృష్ణాపురంలో కాలనీ మధ్య క్వారీ చెరువు నుంచి ముడసర్లోవ రిజర్వాయరు వరకు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున గెడ్డను రూ. 9.50 కోట్లతో ఆధునికీకరించారు. దీని అడుగు భాగంలో సిమెంట్ కాంక్రీట్ వేసి ఇరు పక్కలా రక్షణ గోడలు నిర్మించారు. దీంతో ఇక్కడి ప్రజల సమస్య తీరింది. ఈ గెడ్డ నిర్మాణం చేపట్టక ముందు భారీ వర్షాలు కురిసేటప్పుడు కంబాల కొండల నుంచి క్వారీ చెరువులోకి చేరిన వరద నీరు కిందికి పోవడానికి మార్గం లేక గ్రామంలో పోటెత్తేది. ఇప్పుడు ఆ నీరు నేరుగా ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరుతోంది. దీంతో ఈ గ్రామంలో సమస్య తీరింది. జీవీఎంసీ పన్నెండో వార్డు సంతపాలెంలో రూ.28 లక్షలతో గెడ్డ మరమ్మతు పనులు జరిపించారు. దీనివల్ల గ్రామస్తులకు వాడుక నీరు కాలువల్లో నిల్వ లేకుండా నేరుగా ఈ గెడ్డలోకి చేరి మురుగు సమస్య తీరింది.

రూ.7.50 కోట్లతో కాలువల నిర్మాణం..

నియోజకవర్గంలో సుమారు రూ. 7.50 కోట్లతో కాలువల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టారు. నియోజకవర్గంలో 15 వార్డుల్లో అన్ని కాలనీలలో వీటి నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలకు మురుగు నీటి సమస్య తీరింది.

-రూ. 9.19 లక్షలతో రక్షణ గోడ..

జీవీఎంసీ పదమూడో వార్డు ముడసర్లోవ ప్రాంతంలో రూ. 9.19 కోట్ల నిధులతో జీవీఎంసీ రక్షణ గోడ నిర్మించింది. ఇక్కడ రిజర్వాయరు చుట్టూ రక్షణ గోడతో పాటు దీని పరిసరాలలో జీవీఎంసీకి చెందిన భూముల చుట్టూ రక్షణ కవచంలా ఈ గోడను నిర్మించారు. దీనివల్ల భూములు ఆక్రమణకు గురి కాకుండా అధికారుల సంరక్షణలో ఉండటంతో పాటు రిజర్వాయరులో ఎవరూ దిగకుండా రక్షణ కలుగుతుంది.

కాలువ నిర్మాణంతో వీధులు పరిశుభ్రం..



కాలువలు నిర్మించడం వల్ల రోడ్లు పరిశుభ్రంగా ఉన్నాయి. కాలువలు గోతులు పడి వాడుక నీరు కిందకు వెళ్లడానికి వీలు లేకుండా పోయేది. ఇప్పుడు కాలువలు నిర్మించిన తర్వాత వాడుక నీరు ఎక్కడా నిల్వ లేకుండా కిందకు వెళ్లిపోతుంది. దీనివల్ల కాలనీలలో మురుగు, దుర్గంధం సమస్య తీరింది.

– కాశీయాదవ్, చినవాల్తేరు, 21 వార్డు

మా ఊరి ప్రధాన సమస్య తీరింది..




వర్షం పడితే రామకృష్ణాపురంలో వరద నీరు ఇళ్ల మధ్య నిల్వ ఉండిపోయేది. కొన్నేళ్ల నుంచి ఈ సమస్యతో ఇబ్బంది పడేవాళ్లం. 2020లో ఇక్కడ గెడ్డ నిర్మాణ పనులు ప్రారంభించారు. గత ఏడాది ఈ పనులు పూర్తయ్యాయి. అప్పటి నుంచి మా గ్రామానికి వరద నీటి సమస్య తీరింది. దీనికి ఇరుపక్కలా దృఢమైన గోడలు నిర్మించారు.

– కాకర గోవింద్, రామకృష్ణాపురం, 13వ వార్డు

నేత్రపర్వం.. అయ్యప్ప మహాసంగమం

- వైభవంగా విలక్కు పూజ
- పెద్ద సంఖ్యలో హాజరైన అయ్యప్ప భక్తులు





ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి, పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ఏయూక్యాంపస్ : అయ్యప్ప శరణుఘోషతో ఆంధ్ర విశ్వవిద్యాలయ మైదానం మార్మోగింది. శ్రీ పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పర్యవేక్షణలో ఏయూ మైదానంలో జరుగుతున్న అయ్యప్ప మహా సంగమంలో భాగంగా రెండో రోజు శనివారం అహోరాత్ర విలక్కు పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం అష్టద్రవ్య శ్రీ మహా గణపతి హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించడానికి విచ్చేసిన మేల్ శాంతులు హోమం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యా రాజగోపాల సహిత సరస్వతీ హోమం జరిగింది. సాయంత్రం స్వయంవర పార్వతీ, ఉమా మహేశ్వర మాంగల్య పూజ, మహా హోమం నిర్వహించారు. అనంతరం అహోరాత్ర విలక్కు పూజ వైభవంగా నిర్వ హించారు. కేరళ నుంచి వచ్చిన మేల్ శాంతులు పూజలు నిర్వహించారు. కనులపండువగా జరిగిన ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర నుండి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. శ్రీ పూర్ణ పుష్కల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైలా ఆదిమోహన్ రెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ అధ్యక్షుడు అయ్యప్పదాస్, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, అయ్యప్ప మహాసంగమం పూజా కోర్ కమి టీ చైర్మన్ ఎం.కృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ ధర్మాల శ్రీనివాస రెడ్డి, పూజా కమిటీ చైర్మన్ ఆదిమూలపు నాగరాజు, ట్రస్ట్ అధ్యక్షుడు నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పూజలు

26న తెల్లవారుజామున గణపతి హెూమంతో పూజలు ప్రారంభమవుతాయి. ప్రత్యేక పూజలు, పడిపూజ, అయ్యప్ప భక్తి గీతాల ఆలాపన, హరిహరాసనం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

గ్రీన్ బెల్ట్‌లు పరిశుభ్రంగా ఉంచాలి

- ఆక్రమణలు వెంటనే తొలగించాలి
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: జాతీయరహదారి, బీఆర్‌టీఎస్ రోడ్ల పక్కన గ్రీన్ బెల్ట్‌లను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు మద్దిలపాలెం నుంచి ఎన్ఏడీ కూడలి వరకు జాతీయరహదారిని శనివారం ఆయన పరిశీలించారు. బీఆర్‌టీఎస్‌లో గ్రీన్ బెల్ట్‌లను ఆయన పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్‌లో కొన్ని ప్రాంతాలలో వ్యర్థాలు, చెత్త, బడ్డీలు నిర్వహించడం గమనించిన ఆయన పారిశుధ్య విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ హైవే, బీఆర్‌టీఎస్ రోడ్ల పక్కన గ్రీన్ బెల్ట్‌లలో ఎలాంటి ఆక్రమణలు, బడ్డీలు ఉన్నా వెంటనే తొలగించాలని సూచించారు. వాటిలో పచ్చదనం ఏర్పాటు చేసి ఆహ్లాదంగా తయారు చేయాలని తెలిపారు. రోజూ గ్రీన్ బెల్ట్ ప్రాంతాలను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రణాళిక అధికారి సురేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజు, జోన్–2 జెడ్సీ కనకమహలక్ష్మి, ఏసీపీలు శాస్త్రి, రఘునాథరావు పాల్గొన్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించబడిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 15 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్జిత సుప్రభాత సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. సన్నిధిగొల్ల సేవ అనంతరం శ్రీవారి ముఖ్య మండపంలో భక్తుల సమక్షంలో వేదంపండితులు సుప్రభాతం చదివి వినిపించారు. శ్రీవారి తొలి నైవేద్యంగా నివేదించిన గోక్షీరం, మీగడ, వెన్న, పళ్ల ప్రసాదంగా భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన సత్రంలో 200 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక హారతులు సమర్పించారు, ఆలయ కార్య నిర్వహణధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

ఇసుకకొండకు కార్తీక శోభ



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం.. కార్తీక శోభను సంతరించుకుంది. ఇక్కడ ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు పౌర్ణమి పూజలు జరగనున్నాయి. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకోవడమే గాక సామూహిక వ్రతాల్లో పాల్గొంటారు. ఈ మేరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 27వ తేదీ వేకువజాము నాలుగు గంటలకు ధ్వజస్తంభం పూజ చేస్తారు. ఉదయం 5, 8.30, 10.30 గంటలకు సామూహిక వ్రతాలుంటాయి. ఇందుకోసం రూ.516 పూజా రుసుం చెల్లించాలి. భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించడం లేదని ఈవో తెలిపారు. ఇదిలా ఉండగా చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఆలయం మూసివేస్తారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం తెరుస్తారు.

మరింత సంక్షేమం కోసం మళ్లీ జగనే సీఎం కావాలి



12వ వార్డు సభలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ : రాష్ట్రంలో ప్రజలకు ఇప్పటి వరకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మరింత ఎక్కువ సంక్షేమం అందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అవసరమని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ పన్నెండో వార్డు రెండో నంబరు సచివాలయం పరిధి దుర్గానగర్‌లో శనివారం ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే¹కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ముందుగా ఆయన పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో లక్షల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, బాలరాజు, వరహాలు, సత్యనారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే లింగ వివక్షకు చెక్ పెట్టాలి

డీఈవో చంద్రకళ



ర్యాలీలో పాల్గొన్న డీఈవో చంద్రకళ, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఉన్నతాధికారులు

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే లింగ ఆధారిత హింసకు చెక్ పడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో లింగ అసమానత్వ సమస్యలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. శనివారం పెందుర్తిలోని జిల్లా సమాఖ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఎవరూ పాఠశాలకు దూరంగా ఉండకూడదన్నారు. బాల్య వివాహాలకు చెక్ పెట్టడానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ డి.వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లలను ఆడ, మగ తేడా చూపకుండా పెంచితే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. ప్రతీ కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసి పని ప్రదేశాల్లో హింస లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, అడిషనల్ డీఎంహెచ్‌వో సి.హెచ్ పూర్ణేంద్రబాబు, డీపీఎంలు పి.అరుణకుమారి, బి.వైదేహి, ఎ.సి.కె సత్యంనాయుడు, జిల్లా సమాఖ్య సభ్యులు రేణుక, వల్లయ్య, శ్రీనివాసరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.